పురాతన సంపదను కాపాడుకోవాలి

చంద్రకల్‌లో పురాతన విగ్రహాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

పెద్దకొత్తపల్లి, జనవరి 19 : మండలంలోని చంద్రకల్ గ్రామంలోని 400 ఏండ్ల నాటి విజయనగర కాలంకు చెందిన హన్‌మాన్ విగ్రహాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం చంద్రకల్ గ్రామంలో నిర్లక్ష్యంగా పడి ఉన్న 16వ శతాబ్దం నాటి ఆంజనేయ విగ్రహాన్ని వారు పరిశీలించారు. అలాగే 13వ శతాబ్దానికి చెందిన శివలింగాన్ని కూడా పరిశీలించారు. ఆయన వెంట దినకర్, బడేసాయి, కిరణ్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనాలి

- **జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం**

నాగర్‌కర్నూల్, జనవరి 19 : రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం కోరారు. ఆలిండియా సివిల్ సర్వీసెల్ టోర్నమెంట్ కోసం రాష్ట్రస్థాయి పోటీలను ఈనెల 23,24తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం, సికింద్రాబాద్‌లోని జిమ్‌ఖాన గ్రౌండ్, సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు కలెక్టరేట్ సముదాయంలోని రూం నెంబర్ జీ1లో ఈనెల 21వ తేదీ వరకు తమఉద్యోగ గుర్తింపుకార్డు తోపాటు ఆధార్‌కార్డులతో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, హాకీ, పవర్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నీస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు పురుషులకు క్రికెట్, రెజ్లింగ్, అండ్‌గ్రీకో రోమన్, బెస్ట్ ఫిసిక్, ఖోఖో, యోగా వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వేమన జయంతి

వేమన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రెడ్డి సంఘం నాయకులు

ఉప్పునుంతల, జనవరి 19 : మండలకేంద్రంలో రెడ్డి సంఘం భవనంలో ఆదివారం వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, జంగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అచ్చుతారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాంచంద్రమ్మ, దశరథమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి, జనవరి 19 : మండలకేంద్ర సమీపంలో ఆదివారం ఎస్సై సతీశ్, సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం దర్శనం కోసం వచ్చిన వారు కొంతమంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని, మద్యం మత్తులో అధిక వేగంతో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వివరించారు. ప్రమాదాలను అరికట్టేందుకు వాహనాల తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

- **పల్టీకొట్టిన డీసీఎం.. • దేవదారికుంట వాసులకు గాయాలు**

అచ్చంపేట రూరల్, జనవరి 19 : యాదగిరిగుట్టకు పుట్టెంట్రుకలు తీసి దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం దేవదారికుంట గ్రామాలకు చెందిన ఐదుగురికి గాయాలైన ఘటనా చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరి గుట్టకు పుట్టువెంట్రుకలు తీసి దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ఆదివారం వరంగల్ హైవేపై వారు పయనిస్తున్న డీసీఎం బ్రేకులు ఫెయిలై పల్టీలు కొట్టడంతో దేవదారికుంటకు చెందిన శ్రీను, సుజాత, లక్ష్మయ్య, మవమ్మ, రేణుకలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. హైవే పోలీసులు సమాచారం తెలుసుకొని వెంటనే క్షతగాత్రులను ఘట్‌కేసర్ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

LIC
We are Hiring
ప్రభుత్వరంగ సంస్థ అయిన LIC సంస్థలో
LIC సంస్థ నుండి
కెరియర్ ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము
అర్హత: 10th పాస్
స్టైపెండ్: నెలకు 7,000+ ఆకర్షణీయమైన కమీషన్
సదుపాయాలు: మెడిక్లైమ్, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ & ఇతర సదుపాయాలు
వయస్సు: 21 సం. లు నిండి ఉండాలి.
Cell: 7337069988, 9440238948

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

సాగుయోగ్యంకాని భూములను గుర్తించాలి

- **అదనపు కలెక్టర్ అమరేందర్**

తాడూరు, జనవరి 19 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రైతుభరోసాకు సంబంధించి గ్రామాల్లో, పట్టణాల్లో సాగుయోగ్యం కాని భూముల గుర్తింపు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సాగుయోగ్యం కాని భూములను, రహదారులను, లేఅవుట్లను, కేఎల్ఐ కాల్వలను, గుట్టలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాల్సిందిగా సూచించారు. అనంతరం ఇంద్రకల్ గ్రామంలో పేద ముస్లిం కుటుంబానికి పెళ్లి కానుకగా ప్రముఖ సినీ దర్శకుడు, ప్రొడ్యూసర్ శంకర్ సమకూర్చిన పుస్తె, మెట్టేలు, నిత్యావసర సరుకులను అదనపుకలెక్టర్ ఆధ్వర్యంలో విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు నిరంతర ప్రక్రియ

తిమ్మాజిపేట, జనవరి 19 : అర్హులకు రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రేషన్‌కార్డులపై ఎవ్వరికి ఆందోళన అవసరం లేదని, లేనివారు ప్రజాపాలనలో, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

ఆత్మీయ భరోసా కోసం 2023-24 సంవత్సరంలో ప్రతినెలలో 20రోజులు ఉపాధి పనులకు వెళ్లిన వారు అర్హులని తెలిపారు. రైతుభరోసాలో గుట్టలు, ప్లాట్లు, వ్యవసాయ పొలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారి వివరాలు సేకరిస్తున్నామని, వాటికి మినహాయించి మిగిలిన వాటికి భరోసా అందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేశ్, డీఎస్‌వో శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మిదేవి, తాసీల్దార్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూముల సర్వే

కొల్లాపూర్, జనవరి 19 : మండలంలోని పలుగ్రామాల్లో వ్యవసాయేతర భూములను గుర్తిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి హుస్సేన్ అన్నారు. ఆదివారం పట్టణం శివారులో సాగుకు యోగ్యం కాని భూముల సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు 183 ఎకరాల భూమిసాగుయోగ్యం కాదని నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై తనిఖీలు చేసిన ఆర్డీవో

పెద్దకొత్తపల్లి, జనవరి 19 : వ్యవసాయేతర భూములుగా ఉండి రైతు భరోసాకు లబ్ధిదారులుగా ఉన్న వాటిని ఆదివారం కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ తనిఖీలు చేశారు. మండలకేంద్ర సమీపంలో రైస్‌మిల్‌తో పాటు గోదాంకు కూడా రైతుభరోసా వచ్చేది వాటిని పరిశీలించి వ్యవసాయేతర భూములుగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ రమేశ్‌నాయక్ ఉన్నారు.

సర్వేలో పాల్గొన్న అధికారులు

అచ్చంపేట రూరల్, జనవరి 19 : ప్రభుత్వం అమలుచేస్తున్న రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా సర్వేలో ఆదివారం మండలంలోని చౌటపల్లిలో మండల అధికారులు పాల్గొన్నారు. సర్వే ప్రాధాన్యతను గ్రామస్తులకు, రైతులకు గ్రామపంచాయతీలో వివరించారు.

సర్వేను పారదర్శకంగా సకాలంలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు సూచించారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉప తాసీల్దార్ జెట్టి అశోక్‌కుమార్, అగ్రికల్చర్ ఏవో కృష్ణయ్య, ఏఈవో అనూష, లక్ష్మణ్‌సింగ్, రెవెన్యూ సిబ్బంది ఆంజనేయులు, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూములను తొలగించాలి

వంగూరు, జనవరి 19 : ప్రభుత్వం ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాలో రైతుభరోసాను అందిస్తున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో వీలైనంత వరకు వ్యవసాయేతర భూములను గుర్తించి వాటిని తొలగించాలని డీఆర్‌డీవో ఓబులేశు అధికారులకు సూచించారు.

ఈ నెల 16 నుంచి వివిధ గ్రామాల్లో అధికారులు పర్యటించి వ్యవసాయేతర భూములను గుర్తించడంతో ఆదివారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో డీఆర్‌డీవో సమావేశమై వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తాసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో విజయభాస్కర్, డీటీ వెంకటరమణతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాలి

చారకొండ, జనవరి 19 : సాగుకు యోగ్యం కాని భూమి వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆర్డీవో శ్రీను అన్నారు. మండల కేంద్రంతో పాటు మర్రిపల్లిలో రైతుభరోసా కోసం చేపడుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసాకు క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని చెప్పారు. భూమి భారతి(ధరణి)లో డేటాను సేకరించి విలేజ్‌మ్యాప్, గ్రామ పంచాయతీ లేఅవుట్, రెవిన్యూ భూసేకరణ రికార్డుల డేటాతో సరి పోల్చుకొని రైతుభరోసా కోసం సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు సేకరించాలని అన్నారు.

రైతభరోసాలో ఒక్క రైతుకు కూడా నష్టం చేయొద్దన్నారు. లబ్ధిదారుల తుదిజాబితాను తయారు చేయాలని సర్వే అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ భరత్‌గౌడ్, ఏఈవో అనుషా, సర్వేయర్ అనుషా, జూనియర్ అసిస్టెంట్ శివకృష్ణ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్ కిరణ్మయితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

గోదాములను పరిశీలిస్తున్న ఆర్డీవో బన్సీలాల్

వంగూరులో అధికారులకు సూచనలిస్తున్న డీఆర్‌డీవో ఓబులేశు

చారకొండలో యోగ్యంకాని భూముల వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీను

డ్రైనేజీ పనులు పరిశీలన

కొల్లాపూర్, జనవరి 19 : పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైనేజీ పనులను కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నర్సింహులు డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరవని రెగ్యులర్‌గా బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కార్మిక, కర్షక ఐక్యతతో పోరాటాలు నిర్వహించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 19 : కార్మిక, కర్షక ఐక్యతతో పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక కర్షక, ఐక్యత దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ కార్మికులు, ఇతర శ్రామిక వర్గాల జీవనాధారంపై పాలకులు నిరంతరం దాడిచేస్తున్న నేపథ్యంలో 2025 జనవరి 19 బలోపేత మైన సమైక్య పోరాటాల ప్రారంభ సూచికంగా కార్మిక కర్షక ఐక్యదినంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పాలకులు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రామయ్య, మల్లేశ్, అశోక్, సుభాష్ ఉన్నారు.

వృద్ధురాలు మృతి

కల్వకుర్తి, జనవరి 19 : మండలంలోని ఎల్లికల్‌కు చెందిన రేణమ్మ(56) ఆదివారం మృతి చెందిందని ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.అనారోగ్యానికి గురైన రేణమ్మ కల్వకుర్తి పట్టణానికి వచ్చిందని, స్థానిక శివాలయం వద్ద వాంతులు చేసుకుంటుండగా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారని వివరించారు. చికిత్స పొందుతూ మృతి చెందిందని చెప్పారు. వృద్ధురాలి కొడుకు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

దంతవైద్యశిబిరం విజయవంతం

చికిత్స నిర్వహిస్తున్న వైద్యురాలు

అచ్చంపేట, జనవరి 19 : పట్టణంలోని హరహర డెంటల్ క్లినిక్‌లో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ అచ్చంపేట, హరహర డెంటల్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రవీణనాయక్ పర్యవేక్షణలో 160 మంది రోగులకు చెడిపోయిన పండ్లను తొలగించడం, సిమెంట్ నింపడం, పండ్లపై ఏర్పడిన చారలను తొలగించడం, పండ్లను క్లీన్ చేయడం, ఇతర సమస్యలకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మొక్తాల వెంకటేశ్, సెక్రటరి పోల శ్రీనివాస్, కోశాధికారి శివశంకర్, లయన్ సీనియర్ సభ్యులు గోపిశెట్టి నర్సింహారావు, డాక్టర్ యుఎల్‌చారి, నరేశ్, బాలాజీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే డివిజన్ అధ్యక్షుడి నియామకం

అచ్చంపేట రూరల్, జనవరి 19 : అచ్చంపేట టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ డివిజన్ అధ్యక్షుడిగా సాయిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, రాజు, వెంకటేశ్, గౌరవ సలహాదారులుగా పదిర బాలరాజు, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, కోశాధికారిగా లక్ష్మీపతి తదితరులను ఎన్నుకున్నారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రజాజీవనశైలిలో మార్పు

- **ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి**

నాగదేవ్‌పల్లిలో జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తాడూరు, జనవరి 19 : గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామాల్లో నివసించే ప్రజలయొక్క జీవనశైలి మారుతుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగదేవ్‌పల్లిలో ఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో భాగంగా నూతనంగా మంజూరైన పంచాయతీ భవననిర్మాణం కోసం భూమిపూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిగ్రామంలో పంచాయతీ భవనం ఉన్నట్లయితేనే పరిపాలన సౌలభ్యంతో ఇబ్బందులు కలగకుండా ఉంటాయన్నారు. నాగదేవ్‌పల్లికి రూ.20 లక్షల పంచాయతీ భవనం నిర్మించబోతున్నట్లు తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే రైతుభరోసా, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందనున్నాయన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నూతన పాఠశాల మంజూరుకు ప్రయత్నించి మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో బ్రహ్మచారి, పీఆర్ఏఈ శివకృష్ణ, వల్లపురెడ్డి, వినోద్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తా

నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, జనవరి 19 : నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నదే తన లక్ష్యమని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కుప్పగండ్ల గ్రామంలో ఐక్యతఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అపద అంటే అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు రమేశ్, చెన్నయ్యగౌడ్, శ్రీను, రమేశ్, శివరామ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, జంగయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం వద్దు

- **జిల్లా డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్**

మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోపాల్‌నాయక్

తాడూరు, జనవరి 19 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రేషన్‌కార్డుల పరిశీలనకు సంబంధించి అలసత్వం వహించవద్దని జెడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నూతన రేషన్‌కార్డుల కోసం ఏర్పాటు చేసిన దరఖాస్తుల పరిశీలన కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారుని వద్దకు వెళ్లి కూలంకశంగా పరిశీలించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా వంటి పథకాలకు సంబంధించి అధికారులను అడిగి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఏదేమైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఒకవేళ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిస్తే అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో బ్రహ్మచారి, డీఎల్‌పీవో రామ్మోహన్‌రావు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్, జనవరి 19 : సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 25 నుంచి 28వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాగారి బంగ్లా ఎదుట మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజాసమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల సమస్యలు, భూమిలేని నిరుపేదల సమస్యలు, కార్మిక హక్కులు, ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. కేంద్రం పదేండ్లుగా అనుసరిస్తున్న ఆర్థికవిధానాలు పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయరంగాన్ని, దివాలా తీయించారని, వైద్యం, విద్య, సామాన్యులకు అందనిద్రాక్షలా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎండీ సలీం, బాలశ్రీ, వెంకటస్వామి, సత్యం, బాలయ్య, రామకృష్ణ, శివశంకర్, బాలకృష్ణ, మల్లేశ్, రాముడు, పకీరయ్య, శ్రీను పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

- **కలెక్టర్ బదావత్ సంతోష్**

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 19 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివాం ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించిన రైతుభరోసా, ఇందిరమ్మ, ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు) సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులంతా క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ నెల 20వ తేదీన వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. తిరిగి జనవరి 27వ తేదీన సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఇసుక కొరతను నివారించాలి

- **బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్**

కల్వకుర్తి, జనవరి 19 : కల్వకుర్తిలో ఇసుక కొరత నివారించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇసుక కొరత వల్ల అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక కొరతతో ఇండ్ల నిర్మాణాలు ఆగిపోయాయని, నిర్మాణ రంగాన్ని నమ్ముకుని పొట్ట పోసుకుంటున్న కార్మికుల జీవితాలు పనులు లేక పస్తులుండే దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే దుందుభి నది ఉన్నా.. ఈప్రాంత వాసులు కాళేశ్వరం, గోదావరి నదుల నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సిన కఠిన మైన పరిస్థితులు వచ్చాయని, ఇదేనా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పుఅని విజయ్‌గౌడ్ ప్రశ్నించారు. మన ఊరు- మన ఇసుక వాహనం పథకాన్ని పక్కన పెట్టడంతో ఇసుకకు ఇతర జిల్లాలనుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. కాళేశ్వరం తదితర ప్రాంతాలనుంచి టన్ను ఇసుకను రూ.2500 లకు కొనుగోలు చేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి పనులకు, గృహ నిర్మాణదారులకు మోయలేని భారంగా మారిందని వాపోయారు..

హక్కులకోసం నిరంతరం పోరాటం

- **సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు**

చారకొండ, జనవరి 19 : పేదల హక్కుల సాధనకు సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. ఆదివారం మండలంలోని జూపల్లిలో సీపీఎం నేత ఎల్కశ్రీను సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కశ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు, ఆంజనేయులు, చారకొండ ఏరియా కార్యదర్శి బాలస్వామి పాల్గొన్నారు.

శ్రీను చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జానపద కళాకారుల ఆత్మీయ సత్కారం

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 19 : జిల్లా కేంద్రంలో లహరి గార్డెన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి జానపద కళాకారుల ఆత్మీయ సత్కారానికి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో వివిధ ప్రదేశాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన జానపద కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర మరువలేనిదని మీ పాటనే ప్రజల్లో చైతన్యం తీసుకురాగలిగారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ జిల్లాకు సంబంధించిన కళాకారులు పాల్గొన్నారు.